
సాక్షి అనకాపల్లి

శనివారం । 29 । ఏప్రిల్ । 2023

I



కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

విశాఖ: కనమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.



వేడుకగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది.

మోస్తరు వర్ష సూచన



అనకాపల్లి టౌన్: రాగల అయిదురోజులు వర్షాలు కురిసే అవకాశముందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంజీజీఎస్ కుమారి శుక్రవారం పేర్కొన్నారు. ఉష్ణోగ్రతలు 34.5 నుంచి 34.6 డిగ్రీలు, గాలిలో తేమ శాతం 78 నుంచి 82, గాలి గంటకు 5 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీస్తుందని తెలిపారు.

న్యూస్‌రీల్

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: జిల్లాలో ప్రజలంతా ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించేవిధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి పాఠశాలలు, కళాశాలలు, స్వయం సహాయక సంఘాల సమావేశాలతోపాటు పారిశ్రామిక ప్రాంతాల్లో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. రహదారులపై అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, కూడళ్లలో హెచ్చరిక బోర్డులు, సిగ్నల్‌లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ కె.వి.మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను తమ సిబ్బంది సహాయంతో గుర్తించి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

వైద్యుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

మహారాణిపేట : ఉమ్మడి విశాఖ జిల్లాలో పలు వైద్యుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పలు వైద్యుల పోస్టులు భర్తీ చేస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. పిల్లల వైద్య నిపుణులు, జనరల్ మెడిసిన్ నిపుణుల నియామకం కోసం అర్హులు దరఖాస్తులు మే 2వ తేదీ సాయంత్రం 5గంటలలోపు డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. కేజీహెచ్ గైనిక్ విభాగంలో మూడు పిల్లల వైద్యుల పోస్టులు, జిల్లా ఆస్పత్రి (అనకాపల్లి)లో ఒక పిల్లల వైద్యుడు, జిల్లా ఆస్పత్రి(పాడేరు)లో ఒక పిల్లల వైద్యుడు, అనకాపల్లిలో జనరల్ మెడిసిన్ ఒక పోస్టు భర్తీ చేస్తున్నామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

జగనన్నపై అపారమైన నమ్మకం

- మా భవిష్యత్ నువ్వేనంటూ ఆశలు
- వైవీ సుబ్బారెడ్డి పర్యటనలో జనామోదం
- ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులతో మమేకం



తాళ్లపాలెంలో లబ్ధిదారుల ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న సుబ్బారెడ్డి, చిత్రంలో మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి



నక్కపల్లిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

నక్కపల్లి/ఎస్.రాయవరం/కశింకోట: వైఎస్ జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో అపారమైన నమ్మకం ఉందని, ఆయనతోనే తమ బంగారు భవిష్యత్తు ముడిపడి ఉందని వారు భావిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నక్కపల్లి, ఎస్.రాయవరం, తాళ్లపాలెంలో జరిగిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో పాల్గొన్నారు. వందలాది మంది కార్యకర్తలు, అభిమానులు, పార్టీ నాయకులు వెంటరాగా పలువురి ఇళ్లకు వెళ్లారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత మీ కుటుంబానికి ఏయే పథకాలు వచ్చాయి.. ఎంత మేర లబ్ధి పొందారనే వివరాలు తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులుంటే నిరభ్యంతరంగా తెలియజేయాలన్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు అమ్మ ఒడి వస్తోందని, డ్వాక్రా రుణాలు మాఫీ అయ్యాయని, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వస్తోందని, ఇంటి స్థలం, ఇళ్లు మంజూరయ్యాయని వివరించారు. వారు చెప్పిన వివరాలను ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేస్తున్నామని చెప్పి, వారి సెల్ నుంచి 8296082960 నెంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వాలని సూచించారు. అనంతరం 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్‌ను వారి అనుమతితో అతికించారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

నక్కపల్లి పార్టీ కార్యాలయం వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి పరిపాలన సాగిస్తున్నారన్నారు. కరోనా సంక్షోభ సయయంలో కూడా ఒక్క పథకాన్ని కూడా ఆపిన దాఖలాలు లేవన్నారు. మనందరి ప్రభుత్వాన్ని అడ్డుకునేందుకు తోడేళ్లన్నీ ఏకమవుతున్నాయని, ప్రజాదరణ పుష్కలంగా ఉన్న జగన్‌ను గాని, వైఎస్సార్‌సీపీని గాని ఏమి చేయలేరన్నారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తేనే ఈ పథకాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చింతలపూడి వెంకట్రామయ్య, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు, పార్టీ అదనపు కార్యదర్శి దత్తుడు సీతబాబు, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ పాల్గొన్నారు.

గురజాడ జన్మస్థలంలో..

మహాకవి గురజాడ జన్మస్థలమైన ఎస్.రాయవరంలో సుబ్బారెడ్డి పర్యటించి పలువురు గృహిణులతో సంభాషించారు. పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకున్నారు. గ్రామ ముఖ ద్వారం వద్ద శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న సుబ్బారెడ్డి గురజాడ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి బొలిశెట్టి గోవిందరావు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి పాల్గొన్నారు.

అపూర్వ ఆదరణ

తాళ్లపాలెంలో మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, ప్రభుత్వ విప్ ధర్మశ్రీతో కలిసి నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి అడుగడుగునా ఆదరణ లభించింది. నర్సీపట్నం వైపు రోడ్డులో ఇళ్లకు, దుకాణాలకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరించారు. సచివాలయాన్ని సందర్శించి, కూరగాయలు, చిరుధాన్యాలతో వేసిన ముగ్గును పరిశీలించారు. డాక్టర్ కె.విష్ణుమూర్తి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, అనకాపల్లి పార్లమెంటు పార్టీ పరిశీలకుడు దాడి రత్నాకర్, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్.రాయవరంలో గురజాడ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సుబ్బారెడ్డి

సీఎం వైఎస్ జగన్ విశాఖ పర్యటన ఖరారు

- 3న భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన
- మధురవాడలోని వైజాగ్ ఐటీ టెక్ పార్కుకు శ్రీకారం



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ పర్యటన ఖరారైంది. మే 3న ఉదయం 8 గంటలకు తాడేపల్లిలో గల తన నివాసం నుంచి బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో బయలుదేరి 9.20 గంటలకు విశాఖ విమానాశ్రాయానికి చేరుకోనున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో విజయనగరం జిల్లా భోగాపురం మండలం ఎ.రావివలస గ్రామంలో గల హెలిప్యాడ్ వద్దకు 10 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన 10.25 గంటలకు జీఎంఆర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌కు చేరుకుని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. సభ ముగిసిన తర్వాత 12.30కి బయలుదేరి ఎ.రావివలస గ్రామం వద్ద గల హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ స్థానిక రాజకీయ నాయకులతో సుమారు 40 నిమిషాలపాటు సమావేశమవుతారు. అనంతరం అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధురవాడ ఐటీ హిల్స్ నంబర్ 3 వద్ద గల హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. రోడ్డు మార్గంలో బయలుదేరి ఐటీ హిల్స్ నంబర్ 4లో గల వేదిక వద్దకు 2 గంటలకు చేరుకుంటారు. అక్కడ 30 నిమిషాలపాటు ఉంటారు. అనంతరం 2.30 గంటలకు "వైజాగ్ ఐటీ టెక్ పార్కు" శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. 10 నిమిషాలపాటు ఫొటో ఎగ్జిబిషన్ సందర్శిస్తారు. అనంతరం పారిశ్రామికవేత్తలతో నిర్వహించే కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగిస్తారు. అనంతరం అక్కడి నుంచి 3.50 గంటలకు బయలుదేరి రుషికొండలో గల బాలాజీ బే మౌంట్ విల్లా ఎదురుగా ఉన్న విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ రెసిడెన్సీకి చేరుకుంటారు. ఎంపీ కుమారుడు దంపతులను ఆశీర్వదిస్తారు. అక్కడి నుంచి 4.35 గంటలకు బయలుదేరి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ 20 నిమిషాలపాటు స్థానిక రాజకీయ నేతలతో ఇంట్రాక్ట్ అవుతారు.

అనంతరం హెలికాప్టర్‌లో బయలుదేరి 5.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కి 6.20కి చేరకుని రోడ్డు మార్గాన తాడేపల్లిలో గల తన నివాసానికి చేరుకుంటారు. ఈ మేరకు సీఎం పర్యటన వివరాలను కలెక్టర్ కార్యాలయం నుంచి శుక్రవారం వెల్లడించారు.

మెయిన్ రోడ్డు విస్తరణకు ప్లాన్ ఆమోదం

- వారం రోజుల్లో యజమానులకు నోటీసులు
- రూ.16.66 కోట్లతో పనులు చేపట్టనున్న అధికారులు

నర్సీపట్నం: మెయిన్ రోడ్డు విస్తరణ పట్టాలెక్కింది. టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ సాంకేతిక ఆమోదం తెలుపుతూ జారీ చేసిన రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్‌ను కౌన్సిల్ ముందుంచారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ప్లాన్‌ను కార్యాలయంలో ప్రచురించారు. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అభ్యర్థన మేరకు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మెయిన్ రోడ్డు విస్తరణకు రూ.16.66 కోట్లు మంజూరు చేసి, గత ఏడాది డిసెంబర్‌లో పనులకు శంకుస్థాపన చేశారు. నాలుగు నెలలుగా మున్సిపల్, రెవెన్యూ అధికారులు శ్రమించి శాస్త్ర, సాంకేతికను వినియోగించి ప్లాన్ సిద్ధం చేశారు. దానిని కౌన్సిల్ ముందుంచారు. కౌన్సిల్ వారి తీర్మానం నెం: 17ను అనుసరించి ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. భవనాలు, స్థలాలను కోల్పోయే యాజమానులకు నష్టపరిహారం చెల్లించడానికి బదులుగా టీడీఆర్ సర్టిఫికెట్లు జారీ చేసేందుకు కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకున్నారు. టీడీఆర్ సర్టిఫికెట్లు జారీ చేసే విధానం, ఉపయోగాలపై యజమానులకు అవగాహన కల్పించేందుకు రెండు విడతలుగా సమావేశాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ కనకారావు తెలిపారు. చట్ట ప్రకారం 15 రోజుల గడువుతో యజమానులకు నోటీసులు జారీ చేసి, తొలగింపునకు ఉత్తర్వులు ఇవ్వాలని కౌన్సిల్‌లో తీర్మానించారని కమిషనర్ తెలిపారు.

క్లుప్తంగా

ఐఐటీ, నీట్‌లపై శశిలో అవగాహన సదస్సు రేపు

తగరపువలస: సంగివలస శశి విద్యాసంస్థల ఆవరణలో ఈ నెల 30న నీట్, ఐఐటీలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ఆ సంస్థ చైర్మన్ బూరుగపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. ఈ సదస్సులో అనుభజ్ఞులైన అధ్యాపకులతో విద్యార్థులు, తల్లిదండ్రులకు నీట్, ఐఐటీలపై సందేహాలను నివృత్తి చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని 7వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులు వినియోగించుకోవాలని వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేక్రా క్రాంతి సుధ తెలిపారు. మరిన్ని వివరాలకు 97059 25599, 97056 35599 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జిల్లా కోర్టు పీపీ జగదీశ్వర రావుకు అదనపు బాధ్యతలు



విశాఖ లీగల్: విశాఖపట్నం జిల్లా ప్రధాన న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టెన్సెస్ కేసులు వాదించే పీపీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఇన్‌చార్జ్, లా సెక్రటరీ అయిన సత్య ప్రభాకర్ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం ఆ బాధ్యతలు చూస్తున్న ఎస్.కాళిదాసురెడ్డి పదవీ కాలం పూర్తి కావడంతో ఆయన స్థానంలో జగదీశ్వరరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

బీసీ సంక్షేమ సంఘం సభ నేడు

అనకాపల్లి టౌన్: స్థానిక రింగ్‌రోడ్డులో శనివారం 'హలో బీసీ..చలో అనకాపల్లి' బహిరంగ సభ నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ కసిరెడ్డి మురళీకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హాజరవుతారన్నారు.

31 అంశాలకు జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం



మాట్లాడుతున్న మేయర్ గొలగాని హరివెంకట కుమారి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస రావు

డాబాగార్డెన్స్ (విశాఖపట్నం): జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం మేయర్ గొలగాని హరివెంకట కుమారి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సభ్యుల ముందుకు 31 అంశాలతో పాటు 4 టేబుల్ అజెండాలు వచ్చాయి. వీటిలో అన్ని అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. రూ.కోటి 22 లక్షలతో ముడసర్లోవలో గ్యారెజ్ షెడ్, జీ–20 సదస్సులో భాగంగా ఇటీవల అభివృద్ధి చేసిన సీతకొండ మలుపునకు వైఎస్సార్ వ్యూపాయింట్‌గా నామకరణం చేసేందుకు, జోన్–3,4లో వెండింగ్ జోన్ల ఏర్పాటుకు సభ్యులు ఆమోదించారు. పరిపాలన, అభివృద్ధి పనులకు సంబంధించి సభ్యులు ఆమోదం తెలిపారు. గాజువాక జోన్ పరిధిలో గల ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న జంక్షన్‌కు మాజీ మంత్రి స్వర్గీయ గుడివాడ గురునాథరావు జంక్షన్‌గా నామకరణం చేసేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. అంతేగాక గుడివాడ గురునాథరావు సేవలు కొనియాడుతూ జీవీఎంసీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు గుడివాడ కాంస్య విగ్రహాన్ని కూడా అక్కడ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం గాజువాక నియోజకవర్గానికి సంబంధించి గుడివాడ చేసిన సేవలు, అభివృద్ధిని సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కొనియాడారు. అలాగే కార్పొరేటర్ గుడివాడ అనూష గురునాథరావు చేసిన సేవలు కౌన్సిల్ సభ్యులకు వివరించారు.

అధికారుల తీరుపై అసంతృప్తి

జీవీఎంసీ అధికారులపై కౌన్సిల్ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల్లో సమన్వయం కొరవడిందంటూ విరుచుకుపడ్డారు. సమస్యలు పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డు అభివృద్ధి పనులపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోతోందని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ వద్ద మొరపెట్టుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వార్డుల అభివృద్ధి..స్థానిక సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలని వేడుకున్నారు.

కాలుష్యంపై దృష్టి పెట్టండి : ఎన్నికలప్పుడే రాజకీయాలు. ప్రస్తుతం రాజకీయాలు పక్కన పెట్టి సభ్యులందరూ కాలుష్యంపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ అన్నారు. గతంలో 32 డిగ్రీలుంటే..ప్రస్తుతం 35 డిగ్రీల పైబడే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, భవిష్యత్తు తరాల కోసం వారంలో ఒక రోజూ ప్రతి ఒక్క సభ్యుడు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని కోరారు. సమస్యలుంటే కమిషనర్ దృష్టికి తీసుకెళ్లకుండా..జోనల్ కమిషనర్లను బాధ్యులు చేయాలన్నారు. జీవీఎంసీ ద్వారా హెల్త్ క్యాంపులు, సమ్మర్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను కౌన్సిల్ తరపున సత్కరించారు.

వైవీ సుబ్బారెడ్డితో కాపు నేత తోట నగేష్ భేటీ



సుబ్బారెడ్డితో చర్చిస్తున్న తోట నగేష్

నక్కపల్లి: ప్రముఖ కాపు నాయకుడు, ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ శుక్రవారం వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డితో భేటీ అయ్యారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు నక్కపల్లి వచ్చిన సుబ్బారెడ్డిని ఆయన కలిశారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలు తదితర అంశాలు ఇద్దరి మధ్య చర్చకు వచ్చాయి.

ప్రస్తుతం బీజేపీలో ఉన్న తోట నగేష్ ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యత్వానికి ఇటీవల రాజీనామా చేశారు. ఇంతలో సుబ్బారెడ్డిని కలవడం నియోజకవర్గంలో చర్చనీయాంశమయింది. తోట నగేష్‌కు గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో సన్నిహిత సంబంధాలుండేవి. ఆయన అండదండలతోనే 2005లో ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన నగేష్ 2014 వరకు ఆ పదవిలో కొనసాగారు.

గంజాయి కేసులో పరారైన నిందితుడు అరెస్టు



నిందితుడితో ఎస్‌ఐ నాగేంద్ర

దేవరాపల్లి: గంజాయి కేసులో పరారైన నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ డి. నాగేంద్ర శుక్రవారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం... ఫిబ్రవరి 23న దేవరాపల్లిలో 18 కేజీల గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన అభిషేక్ పాల్, విపిన్‌కుమార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో నిందితులకు గంజాయి సరఫరా చేసి, అప్పటి నుంచి పరారీలో ఉన్న చింతపల్లి మండలం ఏ. అన్నవరానికి చెందిన కిల్లో కోటేష్‌ను ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. అరెస్టు చేసి కోర్టుకు తరలించగా, రిమాండ్ విధించారని ఎస్‌ఐ తెలిపారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

పీహెచ్‌సీ, ఫ్యామిలీ డాక్టర్ తనిఖీల్లో డీఎంహెచ్‌వో హేమంత్



ఎం.కె.వల్లాపురంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హేమంత్

మాడుగుల రూరల్ : వేసవిలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో ఎ.హేమంత్ సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని కింతలి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ప్రసవాల సంఖ్య పెంచాలని వైద్యాధికార్లు కె.ఎం.నాయుడు, నాగదివ్యలకు సూచించారు. అనంతరం పీహెచ్‌సీ పరిధిలోని జేడీ పేట, కేజే పురం పీహెచ్‌సీ పరిధిలోని ఎం.కె.వల్లాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతి ఒక్కరికీ గ్రామాల్లో వైద్య సేవలు అందాలనే ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. జేడీ పేటలోని అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థులు రక్తహీనత బారిన పడకుండా వేసవి సెలవుల్లో ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల్ని 45 రోజులకు సరిపడా ఒకే సారి ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. వేసవి సెలవుల్లో శని, ఆదివారాలల్లో పాఠశాల హెల్త్ అంబాసిడర్ల ద్వారా ఈ మాత్రలను అందించాలని సూచించారు. ఈ తనిఖీల్లో కింతలి వైద్య సిబ్బందితో పాటు కేజే పురం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.లీలాప్రసాద్, సర్పంచ్ కోశిరెడ్డి కృష్ణమూర్తి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మరో ప్రధాన ప్రాజెక్టుకు రైల్వే బోర్డు ఆమోదం

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): వాల్తేర్ డివిజన్‌కు ఎంతో ప్రధానమైన, అత్యవసరమైన విశాఖపట్నం–గోపాలపట్నం 3,4 లైన్లకు శుక్రవారం రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. దీనికోసం రూ.159.47 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు ఆ వివరాలను వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి తెలిపారు. ఈ ప్రాజెక్టు వలన విశాఖపట్నం రాకపోకలు సాగించే రైళ్ల వేచి ఉండే సమయం తగ్గుతుందని, ప్రయాణ వేగం కూడా పెరుగుతుందన్నారు. విశాఖపట్నం–గోపాలపట్నం మధ్య 15.31 కిలోమీటర్ల మేర మూడు, నాలుగో లైన్‌లు నిర్మిస్తే ఈ సమస్యను పరిష్కరించవచ్చన్నారు. ఇటీవల డివిజన్‌లో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న మూడు ప్రధాన ప్రాజెక్టులను సైతం మంజూరు చేయించగలిగారు. ప్రధాని మోదీకి, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు డీఆర్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు.

27 మంది కేంద్ర మంత్రులు బీసీలే..

బీజేపీదే ఆ ఘనత : రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాసరావు



మాట్లాడుతున్న రొంగలి శ్రీనివాసరావు

అనకాపల్లి టౌన్: రాష్ట్రంలో రెండు కుటుంబాల పాలనతో ప్రజలు విరక్తి చెందారని, రానున్న రోజుల్లో బీజేపీకి ప్రజల మద్దతు ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రొంగలి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక చదువులవారివీధిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల వారి నుంచి పుట్టిన పార్టీ బీజేపీ అన్నారు. బీసీ కులానికి చెందిన చాయ్‌వాలా నరేంద్రమోదీని దేశ ప్రధానిగా చేసిన ఘనత బీజేపీకే దక్కిందన్నారు. 27 మంది బీసీలను కేంద్ర మంత్రులుగా చేసిందన్నారు. ప్రపంచ దేశాలకు భారత దేశం గొప్పతనం గురించి మోదీ చాటి చెప్పారన్నారు. 2014 ఎన్నికల తర్వాత బీసీ సంక్షేమానికి దేశవ్యాప్తంగా జనగణన విభజన చేయాలని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఏపీలో నేటి వరకూ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపూడి పరమేశ్వరరావు, జిల్లా నాయకులు కర్రి రామకృష్ణ, కంచిపాటి వెంకట సన్యాసరావు, నరింగరావు పాల్గొన్నారు.

ప్రాంక్‌తో పరేషాన్

- వడ్డాదిలో రాత్రిపూట యువకుల వింత వేషాలు
- పోలీసులకు చిక్కి, మందలింపుతో బయటపడ్డారు



వడ్డాదిలో వింత వేషాలతో యువకులు

బుచ్చెయ్యపేట : లైక్.. షేర్.. సబ్‌స్క్రైబ్ మత్తులో యువత పెడదారి పడుతోంది. ప్రాంక్ వీడియోల మోజులో ఎదుటివారిని ఇబ్బంది పెట్టి, తాము ఇరుకున పడుతున్నారు. బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో యువత సరదా వేషాలు.. స్థానికులకు నిద్రలేని రాత్రుల్ని మిగిల్చాయి. కొంతమంది యువకులు రాత్రిపూట మాస్కులు ధరించి దెయ్యం వేషాలతో స్థానికుల్ని ఆందోళనకు గురిచేశారు. స్థానికుల ఫిర్యాదుపై పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

స్థానిక యువకులు కొందరు వీడియోలు తీసి ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నారు. ప్రాంక్ వీడియోలకు స్పందన ఎక్కువగా ఉంటుందన్న ఆశతో రాత్రి 11 గంటల తర్వాత వీరి చేష్టలు మొదలెడుతున్నారు. పరవాడ బ్రాండెక్స్ నుంచి విధులు ముగించుకుని వస్తోన్న మహిళల్ని, సెకండ్ షో సినిమా నుంచి వస్తున్నవారిని, వివిధ పనులపై బయటికి వెళ్లి తిరుగుముఖం పడుతున్నవారిని లక్ష్యంగా భయపెట్టడం మొదలెట్టారు. తెల్లవస్త్రం వంటికి చుట్టుకుని, ముఖానికి మాస్కులు, పిచ్చి కూతలతో అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చి జనాలు భయపడుతుంటే.. వాటిని చాటుగా వీడియోలు తీస్తున్నారు. ఇవేవీ తెలియని స్థానికులు హటాత్తుగా ఎక్కడి నుంచే వస్తున్న వీరిని చూసి ఆందోళనకు గురవుతున్నారు. గత మూడు రోజులుగా రాత్రిళ్లు రోడ్డుమీదికి రావడానికే భయపడ్డారు. మహిళలు, పిల్లలు, హృద్రోగాలున్నవారు ఇలాంటి చర్యలతో ఇబ్బంది పడతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో వీరు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై రంగంలోకి దిగిన పోలీసులు విచారణ ప్రారంభించగా, ఇద్దరు యువకుల్ని పట్టుకున్నారు. తల్లిదండ్రుల్ని పిలిపించి, వారి ముందే యువకుల్ని మందలించి, విడిచిపెట్టారు. మరొక యువకుడు కూడా దీని వెనుక ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. మరోసారి ఇలాంటి చేష్టలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

వ్యక్తిత్వ హననం చేసి..

యువతి ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో ముగ్గురికి ఐదేళ్ల జైలు శిక్ష

చోడవరం రూరల్: ఇరుగు పొరుగు వారై ఉండి చిన్నపాటి గొడవలో యువతి వ్యక్తిత్వ హననం చేసిన నేరానికి అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం వర్తనాపల్లికి చెందిన ముగ్గురు నిందితులకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ స్థానిక అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సత్తి అరుణశ్రీ శుక్రవారం తీర్పు చెప్పారు. కేసుకు సంబంధించి ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించిన అదనపు పీపీ వేచలపు వెంకటరావు వివరాల ప్రకారం... 2021 నవంబరు 28న పాడేరు పోలీసు స్టేషన్ పరిధిలోని వర్తనాపల్లి గ్రామానికి చెందిన ఫిర్యాదుదారు సోసీ శివ రామకృష్ణ చెల్లెలు గాయత్రి ఉదయం 11 గంటలకు ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పొరుగు ఇంటి వారైన నిందితులు మోసే చంద్రకళ, మోసే నాగమణి, కంబిడి శివశంకర్ తన చెల్లిని మానసిక వేదనకు గురి చేశారని, ఆమె వ్యక్తిత్వాన్ని తూలనాడారని, ఈ అవమానం భరించలేక చనిపోయిందంటూ పాడేరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై అప్పటి ఎస్‌ఐ జి.లక్ష్మణరావు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటనకు ముందు వారం రోజులుగా తమ ఇంటిపైకి వాడక నీరు వస్తుందని, మృతురాలితోపాటు ఆమె తల్లితోనూ నిందితులు గొడవలు పడ్డారు. దాంతో ఫిర్యాదుదారు తండ్రి మురుగునీరు సక్రమంగా పోయేలాగా మరమ్మతులు చేయించాడు. అయినప్పటికీ అదే నెల 27వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో నిందితుల ఇంటి ముందు ఫిర్యాదీ కారు అడ్డంగా నిలిపారంటూ గాయత్రి, ఆమె తల్లితో గొడవకు దిగారు. గాయత్రిని నోటికి వచ్చిన రీతిలో దూషించడమేగాకుండా ఆమెకు లేనిపోని సంబంధాలు అంటగట్టారు. మరుసటిరోజు ఉదయం 10 గంటల సమయంలోనూ ఇదే రీతిలో ప్రవర్తించగా, గాయత్రిని తల్లి సముదాయించి మేకలను మేపడానికి వెళ్లిపోయింది. అటు తర్వాత గాయత్రి మనసు గాయపడటంతో 11 గంటల సమయంలో చీరతో ఫ్యానుకు ఉరేసుకుని చనిపోయింది. ఆమెను ఆత్మహత్యకు ప్రేరేపించారని నిందితులుపైనా ఐపీసీ 306 రెడ్ విత్ 34 సెక్షన్ కింద నేరాభియోగ పత్రాన్ని మోపారు. కేసు పూర్వాపరాలను, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించాక నేరం రుజువు కావడంతో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి పైవిధంగా తీర్పు చెప్పారు.

అత్యాచార యత్నం కేసులో నిందితుడికి రిమాండు

చీడికాడ: వివాహితపై అత్యాచారానికి యత్నించిన కేసులో నిందితుడిని గురువారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్సై రామారావు శుక్రవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం .. మండలంలోని వరహాపురానికి చెందిన ఓ వివాహితపై అదే గ్రామానికి చెందిన యలమంచలి చిన్న ఈ నెల 13న చంపుతానని బెదిరించి అత్యాచారం చేసేందుకు ప్రయత్నించగా, బాధిత మహిళ మరిది గంగరాజు వచ్చి రక్షించాడు. ఈ విషయమై గ్రామపెద్దల సమక్షంలో రాజీ చేసేందుకు ప్రయత్నించగా, బాధితురాలు తిరస్కరించింది. ఈ నెల 20న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

సింగపూర్ తెలుగు సమాజం కమిటీ సభ్యుడిగా రాపేటి



అనకాపల్లి టౌన్: సింగపూర్ తెలుగు సమాజం కమిటీ సభ్యుడిగా రాపేటి జనార్దన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత నెల 5న అక్కడ జరిగిన ఎన్నికల్లో 2023–25 సంవత్సరానికిగాను ఎన్నుకున్నట్టు అనకాపల్లికి చెందిన ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు ప్రజలందరినీ కలుపుకుంటూ వారి సమస్యలు పరిష్కరిస్తానన్నారు.


దోసెలు వేసి సమస్యలు తెలుసుకున్న ప్రభుత్వ విప్



ఓ ఇంటి వద్ద దోసెలు వేస్తూ సమస్యలు తెలుసుకుంటున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: దిబ్బిడిలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దోసెలు వేసి ఆకట్టుకున్నారు. శుక్రవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో గౌన్నా అప్పారావు ఇంటికెళ్లారు. అక్కడ పిండి దోసెలు వేస్తూ అతడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. తనకు, దివ్యాంగుడైన కుమారుడికి పింఛన్లు, రైతు భరోసాతోపాటు ఇతర సంక్షేమ పథకాలు అందుతున్నాయని, వైఎస్సార్‌సీపీ పాలన బాగుందని చెప్పడంతో ధర్మశ్రీ సంతోషం వ్యక్తం చేశారు.

నిప్పంటించుకుని యువకుడి ఆత్మహత్య



మణిందర్(ఫైల్)

రావికమతం: మద్యం మత్తులో శరీరానికి నిప్పంటించుకుని మండలంలోని కొత్తకోట గ్రామానికి చెందిన కోట మణిందర్ (33) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కొత్తకోట ఎస్‌ఐ విభీషణరావు వివరాల మేరకు.. మణిందర్ తరచూ మద్యం సేవిస్తూ బానిసయ్యాడు. దీంతో అతడి భార్య నూకరత్నం పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమె తిరిగి రావడం లేదని మనస్తాపంతో శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. స్థానికులు గమనించి మంటలార్పి నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనకాపల్లి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వ్యాను ఢీకొట్టి యువకుడి మృతి



దుర్గబాబు మృతదేహం

పాయకరావుపేట: పట్టణంలో ఇందిరా కాలనీకి చెందిన అల్లు దుర్గబాబు (33)ను వ్యాన్ ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఎస్‌ఐ రమేష్ వివరాల ప్రకారం.. మృతుడు దుర్గబాబు శుక్రవారం ఉదయం తాండవ జంక్షన్ నుంచి జాతీయ రహదారి దాటి తన ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో తుని నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న వ్యాన్ ఢీ కొట్టడంతో అతడి తలకు బలమైన గాయమైంది. వెంటనే స్థానికులు తుని ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడు భార్య రత్నకుమారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా

పవర్‌లిఫ్టర్ లలితేశ్వరరావుకు అభినందన



పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో గెలుపొందిన లలితేశ్వరరావును అభినందిస్తున్న రామ్‌కుమార్

అనకాపల్లిటౌన్ : స్థానిక డైట్ కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న ఎం.కె.లలితేశ్వరరావు పవర్‌లిఫ్టింగ్ ద్వితీయ స్థానం సాధించినందుకుగాను కళాశాల ఏబీఏ విభాగాధిపతి డాక్టర్ రామ్‌కుమార్ శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖలోని ఏయూ జిమ్నాజియంలో 10వ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్స్ సబ్ జూనియర్ స్త్రీ, పురుషుల విభాగం పోటీలు జరిగాయి. 93 కేజీల విభాగంలో లలితేశ్వరరావు ద్వితీయ స్థానంలో నిలిచాడు.

'సుజల స్రవంతి'కి భూసేకరణ



గ్రామసభలో మాట్లాడుతున్న డీటీ లివింగ్‌స్టన్

అనకాపల్లిటౌన్: బాబూజగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణానికి భూసేకరణపై రైతుల నుంచి అభిప్రాయాల్ని తీసుకుంటున్నట్టు భూసేకరణ డిప్యూటీ తహసీల్దార్ జేడీ లివింగ్‌స్టన్ అన్నారు. పిసినికాడ, కశింకోట గ్రామాల్లో శుక్రవారం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుజల స్రవంతి ప్రాజెక్టు పరిధిలో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వ నిబంధనల మేరకు నష్ట పరిహారం అందించడంతోపాటు, రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందించి, వారిచ్చిన సూచనల మేరకు భూసర్వే చేపడతామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు

కశింకోట : మండలంలోని సోమవరం గ్రామంలో శుక్రవారం ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నెల రోజుల పాటు ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి గొంతిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 1,732 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర
స్పెషల్ రకం	4,270	4,700
మొదటి రకం	4,030	4,480
రెండో రకం	3,690	4,020
మూడో రకం	3,400	3,620

అనకాపల్లి సినిమాలు

సిసు	రాజా
ఏజెంట్	సత్యనారాయణ స్క్రీన్-1
కలియుగ భగవాన్ (ఉదయం ఆట)	
రారా పెనిమిటి (3ఆటలు)	సత్యనారాయణ స్క్రీన్-2
పీఎస్-2	షిర్డీసాయి
విరూపాక్ష	పర్తిసాయి
రుద్రుడు	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
ఏజెంట్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 77 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-21 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-42 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 365 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 261 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (9441108144)ని సంప్రదించవచ్చు.

వేసవి దుక్కు.. లాభాలు దక్కు

'దున్నకుండా సాగుచేస్తే.. కొయ్యకుండా పోతుంది'అనేది తెలుగు నానుడి. ఖరీఫ్, రబీ పంట సీజన్ ఏదైనా.. ముందుగా భూమిని దున్నాల్సిందే. దుక్కి చేయకుండా వదిలేయడంవల్ల భూమి సత్తువ కోల్పోతుంది. చీడపీడలకు ఆవాసంగా మారుతుంది. తర్వాత ఎరువులు, పురుగు మందులపైనే ఆధారపడాల్సి వస్తుంది. అదనపు సాగు వ్యయం నుంచి తప్పించుకోవాలంటే వేసవిలో లోతుగా భూమిలో దుక్కులు చేయాల్సిందే.



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

- కలుపు, చీడపీడల నివారణలో దుక్కులు కీలకం
- కీటకాల గుడ్లు, శిలీంద్రాల సమస్యలు దూరం
- నేల సారం, నీటి నిల్వ సామర్థ్యం పెంపు

అనకాపల్లి రూరల్ : వేసవి దుక్కులతో రైతులకు అనేక ప్రయోజనాలున్నాయి. భూమి సారవంతమై సూక్ష్మజీవులు, వానపాముల సంతతి పెరుగుతుంది. కలుపు చీడపీడలు నివారించవచ్చు. పంటల సాగు పూర్తయ్యాక రైతులు భూములను అలాగే వదిలేస్తే భూమిలోని సారం దెబ్బతిని, పంటలపై ప్రభావం పడుతుంది. భూమిలోని లోతైన పొరల నుంచి నీటిని లాగేస్తుంది. ఈ ప్రమాదాన్ని నివారించడానికి రైతులు రబీపంట చేతికి రాగానే దుక్కులు చేసి భూమి ఆరబెట్టాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. సమగ్ర సస్యరక్షణలో వేసవి దుక్కులు ఉపయోగపడతాయని రైతులకు సూచిస్తున్నారు.

కలుపు, చీడపీడల నివారణ

భూముల్లో పంట పెట్టకుండా బీడుగా ఉంచితే కలుపు పెరిగి భూసారానికి నష్టం వాటిల్లుతుంది. చీడపీడలకు ఆశ్రయంగా మారుతుంది. మొండి జాతికి చెందిన కొన్ని రకాల మొక్కలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతాయి. ఇవి బహుళ వేర్లలో ఆహారాన్ని నిల్వచేసుకుని భూసారాన్ని దెబ్బతీస్తాయి. అందుకే వేసవిలో లోతైన దుక్కులు దున్నాలని అధికారులు చెప్తున్నారు. పంటకాలం ముగిశాక భూములను ఖాళీగా ఉంచితే పంటలను ఆశించే చీడపురుగులు, తెగుళ్లను కలిగించే శిలీంద్రాలు భూమి పొరల్లో ఆశ్రయం పొందుతాయి. దుక్కులతో వివిధ రకాల పంటలు, పండ్ల తోటలను ఆశించే లద్దె పురుగు, బొంత పురుగు, పచ్చ పురుగు, దాసరి పురుగు భూమి పొరల్లో దాగిన గుడ్లు, కోశాలు వెలుపలకి వచ్చి బయటి ఉష్ణోగ్రతలకు చనిపోతాయి. బయట పడిన ప్యూపాలు, గుడ్లను పక్షులు తినడంతో పంటలకు చీడపీడల బెడద తప్పుతుంది.

వర్షాకాలానికి ముందే దుక్కులు

వర్షాకాలం రాకముందే భూమిని కనీసం 3 సార్లు దున్నాలి. ఇలా చేస్తే తొలకరి వర్షాలకు నేల మెత్తబడి నీళ్లు భూమిలో ఇంకుతాయి. దుక్కులు లోతుగా, వాలుగా, అడ్డంగా దున్నుకుంటే వర్షపునీరు భూమిలోనికి ఇంకి తేమను నిల్వ చేసే సామర్థ్యం పెరుగుతుంది. తేమలో జీవించే సూక్ష్మజీవులు, వానపాముల సంతతి వృద్ధి చెందుతుంది. ఇతర గడ్డిజాతి మొక్క విత్తనాలు కూడా వేసవి ఉష్ణోగ్రతలకు మొలిచే శక్తిని కోల్పోతాయి. భూమిని దున్నే ముందు పశువులపేడ, కంపోస్టు ఎరువులు, చెరువు మట్టిని వేయాలి. దీంతో భూమి సారవంతం అవుతుంది. తేమ నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. భూములను అలాగే వదిలేస్తే పొరలు గట్టిపడతాయి. పంటలు వేసిన సమయంలో నారు సరిగ్గా చొచ్చుకుపోదు. దీంతో పోషకాలు సరిగా అందక మొక్కల్లో ఎదుగుదల లోపిస్తుంది. అందుకే వేసవి దుక్కులు తప్పనిసరి.

భూసార పరీక్షలకు ఇదే అనువు

వేసవి దుక్కులతోపాటు భూసార పరీక్షలు చేయించుకోవడానికి ఇదే సరైన సమయం. ప్రస్తుతం రసాయన ఎరువుల వాడకం వల్ల నేల నిస్సారంగా మారిపోతోంది. ఈ నేపథ్యంలో భూసార పరీక్షలు చేయిస్తే మట్టిలో లోపాలు, ఆమ్ల/ క్షార గుణాలు వెల్లడవుతాయి. దీంతో ఏయే పంటలు సాగుచేయాలో, వాటికి ఎంత మోతాదులో ఎరువులు వాడాలో కూడా స్పష్టత వస్తుంది. దీనివల్ల అనవసర ఎరువుల వినియోగం తగ్గి, సాగు ఖర్చులూ కలిసి వస్తాయి.

నేల సారం పెరుగుతుంది



భూమిని 25-30 సెం.మీ. లోతులో దున్నడం వలన నేలలో గాలిల భ్యతతోపాటు, సూక్ష్మజీవుల సాంద్రత పెరుగుతుంది. కర్బన పదార్థాల లభ్యతతో నేల సారవంతమవుతుంది. భూమికి వాలుగా దుక్కు దున్నడంతో వర్షం కురిసినప్పుడు ఆ నీరు భూమిలో బాగా ఇంకుతుంది. వాతావరణంలో నత్రజని వర్షపు నీటితో కలసి నేలకు చేరడంతో భూమి సారవంతంగా మారుతుంది.

– పీయూటీపీ రంగాచారి, వ్యవసాయ అధికారి, అనకాపల్లి


అపూర్వ ఆదరణ



తాళ్లపాలెంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో వైవీ సుబ్బారెడ్డి, అమర్‌నాథ్, బీవీ సత్యవతి, రత్నాకర్

- 'మా నమ్మకం నువ్వే జగన్'లో వైవీ సుబ్బారెడ్డి హాజరు
- అడుగడుగునా హారతులిస్తూ ఘన స్వాగతం పలికిన జనం

కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ భీశెట్టి వెంకటసత్యవతి, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, తదితరులతో కలిసి పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి అడుగడుగునా అపూర్వ ఆదరణ లభించింది. మహిళలు మంగళ హారతులు పట్టారు. గజమాలలు, పూల దండలు, పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలు కప్పి ఘన స్వాగతం పలికారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నర్సీపట్నం వైపు రోడ్డులో ఇంటింటికీ, ప్రతి దుకాణానికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరించారు. అవి సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. గతంలో ఎన్నడూ లేనంత పారదర్శకంగా, సక్రమంగా అందుతున్నాయని లబ్ధిదారులు బదులిచ్చారు. లబ్ధిదారుల సెల్‌ఫోన్‌లతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మిస్డ్‌కాల్ చేయించారు. ప్రభుత్వ పనితీరుపై రూపొందించిన ప్రశ్నలకు సమాధానాలు రాబట్టారు. గృహ యజమానుల అనుమతితో వారిళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ పేరిట రూపొందించిన స్టిక్కర్లను స్వయంగా సుబ్బారెడ్డి అతికించారు. జగనన్న బ్యాడ్జీలను స్థానికులు అందించారు. స్థానిక సచివాలయాన్ని సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం కూరగాయలు, చిరు ధాన్యాలతో వేసిన ముగ్గును పరిశీలించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, వేంకటేశ్వరస్వామి భక్త సేవా బృందం, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పూలమాలలు వేసి, దుశ్శాలువాలతో ఆయన్ని ఘనంగా సత్కరించారు.



వైవీ సుబ్బారెడ్డికి గజమాలతో సత్కారం

కార్యక్రమంలో ఎంపీ సత్యవతి భర్త డాక్టర్ కె.విష్ణుమూర్తి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, అనకాపల్లి పార్లమెంటు పార్టీ పరిశీలకుడు దాడి రత్నాకర్, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, ఎంపీటీసీ సభ్యులు లగిసెట్టి భవాని, సర్పంచ్ కలగా గున్నయ్య నాయుడు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిసెట్టి గణేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'సీనియర్ సిటిజన్లకు రాయితీ ఇవ్వాలి'



ఎంపీ సత్యవతికి వినతి పత్రం అందిస్తున్న బల్లా నాగభూషణం

అనకాపల్లిటౌన్ : సీనియర్ సిటిజన్లకు రైల్ టికెట్‌లో రాయితీ ఇవ్వాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం అన్నారు. ఈ మేరకు స్థానిక ఎంపీ కార్యాలయంలో ఎంపీ సత్యవతికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కరోనా మహమ్మారి కారణంగా దేశవ్యాప్తంగా రైల్లో సీనియర్ సిటిజన్ల టికెట్ రాయితీలను నిలిపేశారని, ప్రస్తుతం అన్ని రైళ్లు యథావిధిగా నడుస్తుండటంతో రాయితీని పునరుద్ధరించాలని కోరారు. వృద్ధుల సమస్యలపై పార్లమెంట్‌లో చర్చించాలని, వృద్ధులకు జిల్లాలో సామాజిక భవనం ఏర్పాటు తదితర అంశాలను వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వినకోట నీలేశ్‌గుప్తా, సహాయ కార్యదర్శి అల్లాడ శ్రీనివాసరావు, సభ్యులు రొబ్బి మల్లేశ్వరరావు, పట్నాల కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో ఉన్నత స్థాయి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

అనకాపల్లిటౌన్ : వేసవి సెలవుల్లో విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం నుంచి సర్కారు బడులకు సెలవుల సందర్భంగా విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే క్రమశిక్షణ అవసరమన్నారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాల కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేంద్రనాథ్ పట్నాయక్, కమల, మన్మోహన్ పాల్గొన్నారు.

క్షయ రోగులకు పోషకాహార కిట్లు



పోషకాహార కిట్లు అందిస్తున్న తగరంపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్ నాయుడు

అనకాపల్లి రూరల్ : ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా తగరంపూడి పీహెచ్‌సీ పరిధిలో చికిత్స పొందుతున్న 9 మంది క్షయ రోగులకు వైద్య సిబ్బంది శుక్రవారం పోషకాహార కిట్లు అందించారు. టీబీ నిర్మూలనలో భాగంగా ప్రతి నెలా రోగులకు పోషకాహార కిట్లను అందిస్తున్నట్టు సిబ్బంది తెలిపారు. చికిత్సా కాలం 6 నెలలు కందిపప్పు, పెసరపప్పు, గోధుమ పిండి, రాగి పిండి, కొమ్ము శనగలు, వేరు శనగ పలుకులు, వంట నూనె కిలో చొప్పున ఆస్పత్రి పరిధిలో చికిత్స పొందుతున్న రోగులకు అందించారు. 2025 నాటికి టీబీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని తగరంపూడి పీహెచ్‌సీ వైద్యుడు ఎం రమేష్ నాయుడు తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు జి.పావని, ఫార్మసిస్టు వెంకటేశ్వర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు

అనకాపల్లి టౌన్ : నియోజకవర్గ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకురాల ఖాళీల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అనకాపల్లి ప్రాజెక్టు సీడీపీవో పి.ప్రభావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంపతిపురం పంచాయతీ పరిధిలో టి.వెంకుపాలెం కేంద్రంలో కార్యకర్త(ఎస్సీ), 80వ వార్డు పీలాపోతునాయుడుగారి వీధిలో ఆయా(ఎస్టీ), కూండ్రం-2 ఆయా(ఎస్టీ), బవులవాడ పంచాయతీ ఆర్.పి.కాలనీ ఆయా(ఎస్టీ), సుందరయ్యపేట పంచాయతీ మొండిపాలెం ఆయా(ఎస్టీ), తుమ్మపాల పంచాయతీ తుమ్మపాల-1 ఆయా(ఎస్టీ), సోమవరం పంచాయతీ సోమవరం-1 ఆయా(ఎస్సీ), అచ్చెర్ల పంచాయతీ గోకివానిపాలెం ఆయా(ఎస్టీ) ఖాళీలున్నట్టు ఆమె పేర్కొన్నారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు వచ్చే నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఐసీడీఎస్ ప్రాజెక్టు, అనకాపల్లి అర్బన్ వారి కార్యాలయంలో నేరుగాగాని, రిజిస్టర్ పోస్ట్ ద్వారా గాని అందజేయాలని కోరారు.

అంగన్‌వాడీల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు

కశింకోట : ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో పి.ప్రభావతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని కశింకోట మండలం సోమవరం-1, మోసయ్యపేట శివారు గోకివానిపాలెం, అనకాపల్లి మండలం సంపతిపురం శివారు టి.వెంకుపాలెంలో ఎస్సీలకు కేటాయించిన అంగన్వాడీ కార్యకర్త, పీలా పోతునాయుడుగారి వీధి, కూండ్రం-2, బవులువాడ ఆర్‌పీ కాలనీ, సుందరయ్యపేట శివారు మొండిపాలెం, తుమ్మపాల-1 కేంద్రాల్లో ఆయా ఖాళీలున్నట్లు పేర్కొన్నారు. వీటిలో సోమవరం ఎస్సీలకు, మిగిలినవి ఎస్టీలకు రిజర్వు చేసినట్లు తెలిపారు. స్థానికంగా స్థిర నివాసం ఉండి, పదవ తరగతి ఉత్తీర్ణులైన వివాహిత మహిళా అభ్యర్థులు మే 5లోగా సీడీపీవో, ఐసీడీఎస్ అనకాపల్లి కార్యాలయానికి నేరుగా గాని, రిజిస్టర్ పోస్టు ద్వారా గాని దరఖాస్తులు అందేలా పంపాల్సిందిగా కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న జీవీవీ సత్యనారాయణ

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి జోన్ పరిధిలో పార్టీని బలోపేతం చేయనున్నట్టు బీజేపీ రాష్ట్ర సభ్యుడు, అంబేడ్కర్ మండల్ అధ్యక్షుడు జీవీవీ సత్యనారాయణ తెలిపారు. జోన్ పరిధిలోని 80, 81, 84 వార్డులను అటల్‌జీ మండల్‌గాను, 82, 83 వార్డులను అంబేడ్కర్ మండల్‌గా విభజించి బూత్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అటల్‌జీ మండల్‌కు అధ్యక్షునిగా మారిశెట్టి భాస్కరరావును నియమించినట్టు పేర్కొన్నారు. 3 నుంచి 6 బూత్‌లను శక్తి కేంద్రాలుగాను, శక్తి కేంద్రాలకు ఇన్‌చార్జిలను నియమించినట్లు వెల్లడించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామీణ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వాయిబోయిన నర్సింగరావు, రామకృష్ణ, నాగమణి, ఉడా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా సాయిలక్ష్మణరావు



నూతన కార్యవర్గం

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా సాయిలక్ష్మణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా సూరా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుని గా బంధం వెంకటరమణ, స్పోర్ట్స్ కార్యదర్శి కె.ఈశ్వరరావు, లైబ్రరీ కార్యదర్శిగా జగపతి, కోశాధికారిగా సందీప్, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసరావు, మహిళా ప్రతినిధిగా కేతా కుసుమ, కార్యనిర్వాహక సభ్యులుగా ప్రసాద్, సాయిరాం, నూకరాజు, రామచంద్రరావు, కిశోర్, లీల, సురేష్ ఎన్నికయ్యారు.

సర్పంచ్ దంపతులకు అభినందన

కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామ పంచాయతీకి మండల స్థాయిలో పారిశుధ్యం మెరుగు, అభివృద్ధి కార్యక్రమాలకుగాను రెండు ఉత్తమ పురస్కారాలు వచ్చినందుకు సర్పంచ్ గొల్లవిల్లి జయ, శ్రీనివాసరావు దంపతులను దుశ్శాలువాతో స్థానిక ప్రజా ప్రతినిధులు, స్థానికులు శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చోడే లక్ష్మి, కార్యదర్శి బాబూరావు, ఎంపీటీసీ సభ్యుడు గొన్నా నాగసత్యనారాయణ, వార్డు సభ్యుడు గొల్లవిల్లి బాబూరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గొల్లవిల్లి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

రేవుపోలవరంలో గ్రామసభ



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్యామ్‌కుమార్

ఎస్.రాయవరం : గ్రామాలు విడదీసినపుడు హద్దులు, రెవెన్యూ ఆదాయం కేటాయింపు జరగాల్సిందేనని తహసీల్దార్ శ్యామ్‌కుమార్ అన్నారు. రేవుపోలవరం గ్రామంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామ విభజన జరిగి 28 సంవత్సరాలు గడిచినా రెవెన్యూపరంగా రూపాయి ఆదాయం రాలేదని సర్పంచ్ చోడిపల్లి అనూరాధ చేసిన ఫిర్యాదు మేరకు మండల అధికారులు గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఇరు గ్రామాల సమన్వయంతో అధికారికంగా గ్రామానికి రావాల్సిన ఆదాయం, సరిహద్దులను నిర్ణయించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సత్యనారాయణ, మండల సర్వేయర్ త్రిమూర్తులు, ఉప సర్పంచ్ చోడిపల్లి గోవిందు పాల్గొన్నారు.

ఇంటర్ ఉత్తీర్ణతలో 'ఆదర్శం'



తేగాడలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల



ఎన్.సంతోష్ (944 ఎంపీసీ)



భాగ్యశ్రీ (950 ఎంపీసీ)

కశింకోట : మండలంలోని తేగాడ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ఇంటర్ ఉత్తీర్ణతలో ముందంజలో నిలిచింది. జిల్లాలోని ఐదు ఆదర్శ పాఠశాల్లో తమ పాఠశాల ఉత్తీర్ణతలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ మార్తా తిలకం శుక్రవారం తెలిపారు. ఆదర్శ పాఠశాల నుంచి 80 మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాయగా 64(80 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎంపీసీలో 38 మందికిగాను 36(94.7 శాతం) మంది ఉత్తీర్ణులైనట్టు పేర్కొన్నారు. ఎంపీసీలో అత్యధికంగా భాగ్యశ్రీ 950, ఎన్.సంతోష్ 944 మార్కులు సాధించినట్టు వెల్లడించారు. బైపీసీలో 23 మందికి 17 మంది, ఎంఈసీలో 9 మందికి ఆరుగురు, సీఈసీలో 10 మందికి 5గురు ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 81 మంది పరీక్షలు రాయగా 51(62.9 శాతం) మంది ఉత్తీర్ణులైనట్టు పేర్కొన్నారు.

➡ తేగాడలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ)లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ గ్రూపులో 33 మందికి 20(60 శాతం) మంది ఉత్తీర్ణులైనట్టు ప్రిన్సిపాల్ డి. చంద్రకళ తెలిపారు. మండలంలోని మోసయ్యపేట శివారు గోకివానిపాలెం గ్రామానికి చెందిన ఎస్.అనూరాధ 883 మార్కులతో టాపర్‌గా నిలిచిందన్నారు. ప్రథమ సంవత్సరంలో 24 మందిలో 13(54 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. కశింకోటకు చెందిన బి.తేజశ్రీ 385 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.

➡ తాళ్లపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 73 మంది పరీక్షలు రాయగా 45(61.6 శాతం) మంది, ప్రథమ సంవత్సరంలో 66 మందికి 45(68.2 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ మళ్ల మాణిక్యం తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి ముంగిటే వైద్యం



రోగికి బీపీ చెక్ చేస్తున్న వైద్యాధికారి వాణిజగదీశ్వరి

అనకాపల్లిటౌన్ : ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందుతోందని తుమ్మపాల వైద్యాధికారిణి నరాల వాణి జగదీశ్వరి అన్నారు. మండలంలో అక్కిరెడ్డిపాలెం పంచాయతీ తారకరామారావు కాలనీలో రోగులకు శుక్రవారం ఆమె వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో అన్నిరకాల వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఉదయం సమయంలో ఒక ప్రాంతంలో రోగులకు తనిఖీలు నిర్వహించి, మధ్యాహ్నం మంచానికే పరిమితమైన రోగుల్ని, వారింటికి వెళ్లి సేవలందిస్తున్నట్టు తెలిపారు. రోగులను పరీక్షించి, అవసరమైన మందుతు ఉచితంగానే అందిస్తున్నామన్నారు. ఎమర్జెన్సీ కేసులను సిబ్బంది సాయంతో సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్కిరెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో ప్రతి నెలా రెండు, నాలుగు శుక్రవారాల్లో వైద్య సేవలందిస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎం.మరియమ్మ, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధి సబ్బవరం, పరవాడ మండలాల్లోని పలు గ్రామాల్లో ఖాళీ గా ఉన్న అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో వి.లలితకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రిజర్వేషన్‌ను అనుసరించి, ఆయా కేటగిరీ అభ్యర్థులతో ఈ సీట్లు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగి, స్థానికంగా నివాసం ఉండే వివాహమైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

భవిత కేంద్రానికి మెగాఫోన్ వితరణ



మెగాఫోన్ అందజేస్తున్న పైల శ్రీనివాసరావు

పరవాడ: పరవాడ గ్రామానికి చెందిన దివంగత పైల శిరీష 13వ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె తల్లిదండ్రులు పైల అప్పారావు, ఆయన సతీమణి స్థానిక భవిత కేంద్రానికి బహూకరించిన రూ.6 వేల విలువైన మెగాఫోన్‌ను రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాములనాయుడు చేతుల మీదుగా భవిత కేంద్ర ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాస్‌కు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బండారు రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, నాయకులు పైల అప్పలనాయుడు, వెన్నెల సన్యాసిరావు, పైల హరీష్, పోతల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.